క్లుప్తంగా

10న దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం



బొగ్గురోడ్డులోని దుర్గాలమ్మ తల్లి

తగరపువలస: చిట్టివలస బొగ్గురోడ్డులోని దుర్గాలమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవం ఈ నెల 10న జరగనుంది. చిట్టివలస, చిల్లపేట, జీరుపేట, సంతపేట, కొత్తపేట, గల్లీరోడ్డులోని ఎస్సీ కాలనీ, కొండపేట, చిట్టివలస కళ్లాలు, విల్సన్‌పేట, నమ్మివానిపేట, సుఖీభవ కాలనీ తదితర 14 గ్రామాల ప్రజలు ఈ ఉత్సవాల్లో పాల్గొననున్నారు. వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు ఆలయ ఆవరణలో మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తారు. కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని అదృశ్యం



శ్రావణి

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని కన్నూరు శ్రావణి అదృశ్యమయింది. ఈ నెల 4న కళాశాలకు బయలుదేరిన యువతి తిరిగి ఇంటికి రాలేదు. ఈ మేరకు పెందుర్తి మండలం సరిపల్లికి చెందిన ఆమె సోదరుడు కల్యాణ్ కళాశాలలో విచారించగా ఆ రోజు కాలేజీకి రాలేదని తెలిపారు. దీంతో భీమిలి పోలీసులకు ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశాడు. ఏఎస్‌ఐ సత్తిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

8 నుంచి టార్గెట్ బాల్ పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ అరుణ్ కార్తీక్

కొమ్మాది: అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఫిబ్రవరి 8 నుంచి 10వ తేదీ వరకు అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ టార్గెట్ బాల్ పోటీలు (పురుషుల విభాగం) నిర్వహించనున్నట్లు గీతం క్రీడా విభాగం డైరెక్టర్ అరుణ్ కార్తీక్ తెలిపారు. హ్యాండ్ బాల్, బాస్కెట్ బాల్ క్రీడలను కలిపి 2012లో టార్గెట్ బాల్‌గా అభివృద్ధి చేశారని, 2017 నుంచి భారతీయ విశ్వవిద్యాలయాల సంఘం దేశంలోని వర్సిటీల్లో ఈ క్రీడను ప్రోత్సహిస్తోందని తెలిపారు. పోటీల్లో దేశంలోని 29 విశ్వవిద్యాలయాల నుంచి 350 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

అంధబాలల పాఠశాలలకు సాయం

కొమ్మాది: సాగర్‌నగర్ అంధబాలల పాఠశాలలో నాణ్యమైన విద్య అందించేందుకు సహాయ సహకారాలు అందిస్తున్నామని దివీస్ కార్పొరేట్ సామాజిక బాధ్యత అధికారి నాగరాజు అన్నారు. ఈ పాఠశాలలో ఒక ఉపాధ్యాయురాలిని, ఇద్దరు వలంటీర్లను, ఒక సంగీత ఉపాధ్యాయురాలిని, ముగ్గురు సహాయకులను నియమించి నెలకు రూ.5500 గౌరవ వేతనం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎమ్.మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మహాలక్ష్మీపురంలో ఎర్రచెరువు కబ్జాకు యత్నం



ప్రైవేట్ వ్యక్తులు తవ్వేసిన తర్వాత చెరువు గట్టు

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ మహాలక్ష్మీపురంలో ఎర్రచెరువు కబ్జాకు కొందరు ప్రయత్నించారు. పంచాయితీవాసులు గుర్తించి ఆందోళన చేపట్టడంతో సదరు వ్యక్తులు వెనుకడుగు వేశారు. వివరాల్లోకి వెళ్తే... తగరపువలస – భీమిలి రహదారిని ఆనుకుని సర్వే నంబర్ 17లో 5.45 ఎకరాల్లో ఎర్ర చెరువు విస్తరించి ఉంది. దీని పక్కనే సర్వే నంబర్ 16/1లో జిరాయితీ భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేశారు. వీరు తమ స్థలానికి ఫెన్సింగ్ వేసే నిమిత్తం వారం రోజులుగా ఇక్కడ పనులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం జిరాయితీ స్థలం కొనుగోలుదారులు చెరువు గట్టును తవ్వి చదును చేసి అందులో నుంచి ఫెన్సింగ్ వేయడానికి ప్రయత్నించారు. గమనించిన స్థానికులు రేఖవానిపాలెం సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావుకు సమాచారం అందించారు. దీంతో ఆయన అక్కడకు చేరుకుని చెరువు గట్టును తవ్వేశారంటూ పనులు నిలిపివేయాలని కోరుతూ భీమిలి తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ముందుగా చెరువు స్థలానికి సర్వే చేసి విలువైన 5.45 ఎకరాల స్థలాన్ని వదిలివేసిన తర్వాతే జిరాయితీ భూమిలో ఫెన్సింగ్ వేసుకోవాలని కోరారు. ఆయనతోపాటు ఉప సర్పంచ్ పీతల గంగశ్రీను, మల్లేటి హరిశంకర్ ఉన్నారు.

శిల్పారామానికి సరికొత్త సొబగులు

కళాకృతులకు జోరుగా పెయింటింగ్ పనులు



మెరిసిపోతున్న డబ్బు సంచుల బొమ్మ



ఆకట్టుకుంటున్న పక్షుల గూడు



తలపై పుస్తకాల దొంతరతో బాలిక



ఆధునిక విజ్ఞానం తెలియజేసే కళాకృతి

పీఎం పాలెం: శిల్పారామంలో కొలువుతీరిన వివిధ కళాకృతులకు, జీవకళ ఉట్టిపడే శిల్పాలకు పెయింటింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి. ఏళ్ల తరబడి పెయింటింగ్‌కు నోచుకోక మసిబారిన కళాకృతులను ఆకర్షణీయంగా తీర్చిదిద్ది నూతనంగా ఆవిష్కరింపజేయడానికి రాష్ట్ర పర్యాటక శాఖ సంకల్పించింది. ఈ క్రమంలో సుమారు 27 ఎకరాల్లో విస్తరించిన శిల్పారామంలో సహజత్వం, జీవకళ ఉట్టిపడేలా దర్శనమిచ్చే శిల్పాలకు రంగులు వేసే పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని కళాకృతులకు పెయింటింగ్ పనులు, గోపురాల మరమ్మతులు పూర్తయ్యాయని స్థానిక పరిపాలనాధికారి విశ్వనాథ రెడ్డి తెలిపారు. గతంలో చేపట్టిన అన్ని నిర్మాణాలకు మరమ్మతులు చేయించడంతోపాటు కళాకృతులకు పెయింటింగ్ వేయిస్తామని ఆయన తెలిపారు.

యాజమాన్యం బూటక ప్రకటనలు నమ్మొద్దు

జ్యూట్‌మిల్లు లాకౌట్ బాధిత కార్మిక సంఘం ప్రతినిధులు



హైకోర్టు న్యాయవాదులతో జ్యూట్‌మిల్లు లాకౌట్ బాధిత కార్మిక సంఘం ప్రతినిధులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో మిగిలిపోయిన కార్మికులు దరఖాస్తులు చేసుకుంటే చెల్లింపులు చేస్తామని యాజమాన్యం నోటీసు బోర్డులో చూపించే బూటకపు ప్రకటనలు నమ్మవద్దని జ్యూట్‌మిల్లు లాకౌట్ బాధిత కార్మిక సంఘం ప్రతినిధులు కోరారు. భీమిలి రోడ్డులోని తమ కార్యాలయంలో వారు సోమవారం మాట్లాడారు. యాజమాన్యం చెల్లింపులు నిరాకరించిన కార్మికులంతా తమ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మిల్లు యాజమాన్యం, అఖిలపక్ష కార్మిక సంఘాలు, ప్రభుత్వ పెద్దల సమక్షంలో చేసుకున్న ఒప్పందం చెల్లుబాటుకాదన్నారు. హైకోర్టులో విచారణలో ఉన్న కేసును నీరుగార్చే ఎత్తుగడలు యాజమాన్యం అనుసరిస్తోందని ఆరోపించారు. నిరుపేద కార్మికుల పక్షాన తాము పోరాడుతూ యాజమాన్యం ఎత్తుగడలు అడుగడుగునా నిరసిస్తూ హైకోర్టులో వేసిన కేసు చివరి దశకు చేరుకుందన్నారు. తాము కార్మికుల తరపున ఏర్పాటు చేసిన న్యాయవాదులు ఈ నెల 15న తమ వాణిని వినిపించనున్నారన్నారు. ఇకపై యాజమాన్యం అనైతిక ఎత్తుగడలు, కుయుక్తులు చెల్లబోవన్నారు. సీనియర్ నాయకుడు సింగిడి అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడు నాగోతు అప్పలరాజు, అధ్యక్షుడు వేజెర్ల సూర్య అప్పలనరసింహరాజు, కార్యదర్శి జీరు వెంకటరమణ, యరబాల తాతారావు, చిల్ల దాలయ్య రెడ్డి, జన్నుల రమణ, పాసల శివ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై పలకలు ఏర్పాటు చేయండి

జోన్ - 2 స్పందనకు 10 అర్జీలు



జెడ్సీ కనకమహాలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న అర్జీదారులు

మధురవాడ: కొమ్మాది కూడలి నుంచి పీఎంపాలెం క్రికెట్ స్టేడియం వరకు జాతీయ రహదారికి రెండు వైపులా రోడ్డును ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌లపై చాలా చోట్ల పలకలు విరిగిపోయి పాదచారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, వాటిని తక్షణమే సరిచేయించాలని మధురవాడ పౌర సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జోనల్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో జెడ్సీ కొట్యాడ కనక మహాలక్ష్మికి వినతిపత్రం అందించారు. మధురవాడ అల్లూరి సీతారామరాజునగర్‌లో గల యూపీహెచ్‌సీకి ప్రహరీ నిర్మించాలని పౌర సంక్షేమ సంఘ అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు, ప్రదీప్ కుమార్, పాపారావు కోరారు. జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి పలు సమస్యలపై 10 అర్జీలు వచ్చాయి. అర్జీలపై తక్షణ చర్యలు చేపడతామని కనక మహాలక్ష్మి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అప్పలరాజు, ఏసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సామవేదం బాలుకు సన్మానం



బాలును సన్మానిస్తున్న ఎంపీపీ రాంబాబు, తులసి

పద్మనాభం: ఆసియా వేదిక్ కల్చరల్ రీసెర్చి యూనివర్శిటీ, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీవో సంస్థచే గౌరవ డాక్టరేట్ అందుకున్న మద్ది గ్రామానికి చెందిన సామవేదం బాల సుబ్రహ్మణ్యం (బాలు)ను మద్ది గ్రామంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, తులసి లక్ష్మి దంపతులు సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం పద్మనాభంలోని బీజేపీ కార్యాలయంలో రూపాకుల విశాలాక్షి, సుబ్రహ్మణ్యం చారిటబుల్ ట్రస్టు తరపున రూపాకుల రవి కుమార్ తదితరులు బాల సుబ్రహ్మణ్యం దంపతులను, అవార్డు అందుకున్న కళాకారిణి ఎస్.గౌరీశ్రీ, హార్మోనిస్టు కృష్ణమూర్తిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉప్పాడ అప్పారావు, ఆర్.శ్రీనివాసరావు, హెచ్.మహేష్, ఎం.అప్పలరమణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి తగరపువలస 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ అంతరాయం కారణంగా తగరపువలస మెయిన్ రోడ్డు, రాములమ్మ థియేటర్, తాతా థియేటర్, పాత లోకల్ ఆఫీస్ వీధి, రాజవీధి, బంగ్లామెట్ట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చిట్టివలస ఏఈఈ బొట్ట రవి తెలిపారు.

మధురవాడ: మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అసిస్టెంట్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్వీఎస్ రామమూర్తి చెప్పారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు మధురవాడ మెయిన్ రోడ్డు, ఎంఎస్ఆర్ లే అవుట్, శ్రీవల్లినగర్, చంద్రంపాలెం, ఉజ్వల హాస్పిటల్ ఏరియా, భాస్కరనగర్, సంపత్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నిర్మాణ పనులు ఆపాలని వినతి



జెడ్సీ రాముకు వినతిపత్రం అందిస్తున్న కాలనీ వాసులు

భీమునిపట్నం: భీమిలి సమీప కీతిన్‌పేట వద్దనున్న వుడా కాలనీలోని ఖాళీ స్థలంలో అధికారులు చేపడుతున్న ఉన్నత పాఠశాల నిర్మాణ పనులు ఆపాలని ఆ కాలనీవాసులు సోమవారం స్పందన కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముకు విన్నవించుకున్నారు. ఇక్కడి కాలనీలో పార్కుతోపాటు ఇతర అవసరాలకు 74 సెంట్లు ఖాళీ స్థలం ఉందని తెలిపారు.

సమీపంలోని రాయపాలెం వద్దనున్న ప్రభుత్వ పాఠశాల పాడైపోవడంతో అందులోని ప్రాథమిక పాఠశాల నిర్వహణకు తాత్కాలికంగా ఇందులోని కొంత స్థలం ఇచ్చామని తెలిపారు. అధికారులు అక్కడ కొత్త ప్రాథమిక, ఉన్నత పాఠశాల నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా... ఇప్పుడు తమ వద్దనున్న ఖాళీ స్థలంలో ఉన్నత పాఠశాల నిర్మాణాన్ని చేపట్టడం సరికాదని తెలిపారు. దీనిపై జెడ్సీ స్పందించి పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆనందపురం/ మధురవాడ : ఇంటింటికీ తిరిగి రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్న వ్యక్తులను సోమవారం పౌర సరఫరాల శాఖ అధికారులు నిఘా పెట్టి పట్టుకున్నారు. వారి నుంచి సుమారు వంద కిలోల బియ్యం స్వాధీనం చేసుకొని గంభీరం రేషన్ డిపో డీలర్‌కు అప్పగించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల రేషన్ అందించే వాహనాల వద్ద కొంత మంది వ్యాపారులు లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నట్టు అందిన సమాచారం మేరకు నిఘా పెట్టారు. ఈ మేరకు బోయిపాలెం, పరదేశిపాలెం తదితర ప్రాంతాల్లో బండారు శ్రీనివాసరావు అనే వ్యక్తి బియ్యం కొనుగోలు చేసి పెద్దిపాలెంలోని రైస్ మిల్లులకు తరలించినట్టు గుర్తించారు. పౌర సరఫరాల శాఖ సీనియర్ అసిస్టెంట్ బి.రమణ మాట్లాడుతూ లబ్ధిదారుల వద్ద కిలో రూ.12కు కొనుగోలు చేసి... మిల్లు యజమానులకు రూ.18కు విక్రయిస్తున్నట్టు తెలిసిందన్నారు. 6ఏ కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు.

భూ తగాదాలో పలువురికి గాయాలు

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం పంచాయతీ ప్రసాదువానిపాలెం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన భూ తగాదాలో పలువురు గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. స్థానికంగా గల పెట్రోల్ బంక్ యజమానికి, స్థానికులైన ప్రసాదునాయుడు కుటుంబ సభ్యుల మధ్య భూ తగాదా ఉంది. కాగా ఆ వివాదాస్పద భూమిలో ఉన్న పాకలో తాను, కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా పెట్రోల్ బంక్ యజమాని సుమారు వంద మందితో వచ్చి పాకను, అక్కడ ఉన్న రెండు ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారని, తమను చావబాది బయటకు నెట్టివేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ప్రసాదు నాయుడు పేర్కొన్నాడు. అర్ధరాత్రి సంఘటన జరగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ మేరకు ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం బాధితులు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు.

పబ్లిక్ డిమాండ్

ఎస్సీ కాలనీలో మెట్లు నిర్మించాలి



ఎస్సీ కాలనీలో రహదారి మధ్య ఎత్తయిన ప్రదేశం

తగరపువలస: జీవీఎంసీ 6వ వార్డు ఎస్సీ కాలనీలో ఇళ్ల మధ్య రహదారి అయిదు అడుగుల ఎత్తు వ్యత్యాసంలో ఉంది. ఈ కాలనీలో ఒకవైపు సీసీ రోడ్డు మీదుగా చుట్టూ తిరిగి చేరుకోవాల్సి ఉండగా మరొకవైపు అయిదు అడుగుల ఎత్తులో కల్వర్టు ఉంది. కల్వర్టు దాటితే కేవలం కొద్ది దూరంలోనే వంద అడుగుల మెయిన్‌రోడ్డు ఉంది. ఇక్కడ మెట్లు నిర్మించాలని మూడేళ్లుగా జోనల్ కార్యాలయంతోపాటు 36వ నంబరు సచివాలయం చుట్టూ కాలనీవాసులందరం తిరుగుతున్నాం. మెట్లు నిర్మిస్తే ప్రధాన రహదారి మీదుగా నేరుగా చేరుకోవచ్చు.

– సియ్యాద్రి నాగరాజు, ఎస్సీ కాలనీ, కొమ్మాది

పీఎన్ఆర్ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన చిన్నారులతో కోచ్‌లు పరదేశి, గౌతమ్

తగరపువలస: నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఈ నెల 5న జరిగిన ఏపీ రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్ – 2023లో తగరపువలస పీఎన్ఆర్ మార్షల్ ఆర్ట్స్ శిక్షణ కేంద్రం చిన్నారులకు బంగారు, రజత, కాంస్య పతకాలు లభించాయి. కాటా అండ్ జూనియర్స్ బాయ్స్ అండ్ గర్ల్స్, కుమేతి కేటగిరీలో అయిదుగురు విద్యార్థులు పతకాలు సాధించారు. వీరిలో 3వ తరగతి విద్యార్థి తమ్మిన పవన్ తేజ బంగారు, కాంస్య పతకాలు సాధించగా, 5వ తరగతి విద్యార్థిని బొల్లి ఇషా శర్వాణి కాంస్యం, రజతం, 6వ తరగతి విద్యార్థి బోని లియోనల్ మెస్సీ రజత, కాంస్య పతకాలు సాధించారు. అలాగే 7వ తరగతికి చెందిన గోపతి చైతన్య రజత పతకం సాధించగా, మైనపు తేజేస్ రెండు బంగారు పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా వీరిని ఆల్ ఇండియా మార్షల్ ఆర్ట్స్ ఎగ్జామినర్ పి.నరసింహారావు, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ జి.శివరామకష్ణ, కోచ్‌లు బంగారు పరదేశి, బంగారు గౌతమ్ అభినందించారు. కార్యక్రమంలో బోని ఈశ్వర్‌కుమార్, తమ్మిన అశోక్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు బంద్‌తో ఇబ్బందులు



సర్వీసు రోడ్డులో రాకపోకలకు అడ్డుగా స్టాపర్లు

పీఎం పాలెం: కారుషెడ్ కూడలి నుంచి క్రికెట్ స్టేడియం, హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే సర్వీసు రోడ్డులో స్టాపర్లు పెట్టి రాకపోకలను పూర్తిగా నిలిపివేడయంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో పైన పేర్కొన్న ప్రాంతాలకు వెళ్లడానికి ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. అయితే ట్రాఫిక్ పోలీసులు ఉదయం, సాయంత్రం వేళల్లో కొంత సమయం మాత్రమే ద్విచక్ర వాహనాలు ప్రయాణించడానికి వీలుగా స్టాపర్లు జరిపి అవకాశం కల్పిస్తున్నారు. మరలా మూసివేస్తున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు నిరంతరం రాకపోకలు సాగించడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులను స్థానికులు, వైఎస్సార్ సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర సమాజం

పద్మనాభం: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటను ఆరగించడం వల్ల ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని కోరాడ సర్పంచ్ కోరాడ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని కోరాడలో సోమవారం రైతులకు ప్రకృతి వ్యవసాయం సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా యాంకర్ ఎస్.వెంకటరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించడం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. ఈ రకంగా పండించిన ధాన్యం, పప్పులను తిరుమల తిరుపతి దేవస్థానం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఘన, ద్రవ జీవామృతాల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కోండ్రోతు శ్రీనివాసరావు, ఏవో ఎం.వి.ఎస్.చలం, సబ్ డివిజనల్ యాంకర్ ఎం.అప్పలనాయుడు, మాస్టర్ ట్రెనీ బి.దుర్గారావు పాల్గొన్నారు.



జీవామృతం తయారీపై అవగాహన కలిగిస్తున్న అధికారులు

నారసింహుడికి వైభవంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఘనంగా గరుడసేవ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్ఠంపజేశారు. అష్టోత్తరశతనామావళి పూజ అనంతరం భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు. అర్చకుడు చిన్నా తదితరులు ఈ పూజ నిర్వహించారు.